# జ్యోతిబా పూలే.. ఆదర్శప్రాయుడు

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి



జ్యోతిభాపూలే చిత్రపటం నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 11 : బడుగు; బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీల విద్య కోసం పాటు పడిన జ్యోతిభాపూలే అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరం లో వెనుకబడిన తరగతుల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని అన్నారు. మహిళలకు విద్య ను అందించేందుకు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సం క్షేమం కోసం, వారిలో ఆత్మ స్థైర్యం కల్పించి హక్కుల కోసం పోరాడి సాధికారతకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీబీసీడీవో ఉపేందర్, డీఎస్పీడబ్ల్యూవో మల్లేశం, సీపీవో వెంకటేశ్వర్లు, డీసీఎస్‌వో మోహన్ బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఏబీసీడీవో భీమ్‌రాజు, వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్, బీసీ అభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించాలి**

విజయ డెయిరీ కేంద్రంలో నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో విజయ తెలంగాణ పాల ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ డెయిరీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. విజయ డెయిరీ కేంద్రం ద్వారా ఉత్పత్తులను ప్రజలకు అందించేందుకు వీలుగా ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి మన దుకాణం, జిరాక్స్, స్టేషనరీ షాపులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వస్తువుల విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**పోషణ్ పక్షాన్ని విజయవంతం చేయాలి**

పోషణ్ అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 22 వరకు నిర్వహించే పోషణ్ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, స్త్రీ శిశు సంక్షేమ, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వైద్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, జి ల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పోషకాహారాలు కలిగిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని కలెక్టర్ సూచించారు.

**ప్రతి ఉద్యోగికి విరమణ సహజం**

ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వికారాబాద్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి

**వికారాబాద్ :** మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్, విద్యా, జిల్లా సంక్షేమ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో మాదకద్రవ్య నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మాదక ద్రవ్యాలు తీసుకొంటే జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్యాసంస్థలు, వసతి గృహాల్లో వీటి వాడకంతో జరిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పర్యటించే క్రమంలో మహిళా స్వయం సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వీటి వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు చేయడంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ సభను విజయవంతం చేద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

- నేడు మొయినాబాద్‌లో రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశం
- చేవెళ్ల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి
- పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 11 : బీఆర్ఎస్ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాల్సిన అవసరం ఉందని పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభను పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. మొయినాబాద్‌లోని స్టార్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి చేవెళ్ల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటు చేశారని, ఈ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్నదని తెలిపా రు. ఈ సభలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్ర జావ్యతిరేక విధానాలను వేదికపై నుంచి పార్టీ అధినేత కేసీఆర్ ఎండగడతారన్నారు. వరంగల్‌లో సభ ఏర్పాట్లు చేస్తుండడంతో ప్రభుత్వం వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. నేడు జరిగే సమావేశానికి చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట, చేవెళ్ల మండలాలు, మున్సిపాలిటీల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, ఎంఏ రావూఫ్, జయవంత్, రవియాదవ్, నర్సింహాగౌడ్, అంజయ్యగౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు పరమేశ్, అజ్మాత్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వెంకటరమణ
- నూతన వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ

వికారాబాద్, ఏప్రిల్ 11 : విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల నూతనంగా నియమితులైన వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని చేసే విధానం, ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడం తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న అన్ని ప్రాథమిక కేంద్రాల వైద్యులు, ఆయుష్మాన్ పల్లె దవాకానల్లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, కీటక జనత వ్యాధులు, టీబీ, లెప్రసీ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధి కూలీలకు గ్రామాల వారీగా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉప వైద్యాధికారులు జీవరాజ్, రవీంద్ర యాదవ్, ప్రోగ్రాం అధికారులు పవిత్ర, బుచ్చిబాబు, జానీ, నిరోషా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో శ్రీనివాసులు, స్టాటిస్టికల్ అధికారి నాగమల్లేశ్వరరావు, డీపీహెచ్ఎన్‌వో చండీశ్వరి, ఏఎంవో సత్యం, మహేశ్, హెల్త్ ఎడ్యుకేటర్ రజిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవఖానాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- వెనుకబడిన తరగతుల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు

ఆదిబట్ల, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిబా పూలే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు అని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతు ల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పూలే కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడారని, బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు అని, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆయన చేపట్టిన సంస్కరణలు కారణమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స హాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమేశ్, డీఆర్‌వో సంగీత, బీసీ సంక్షే మ శాఖ అధికారి బి కేశురాం, మెప్మా పీడీ మల్లీశ్వరి, డీఎస్‌వో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, డీపీఆర్‌వో వెంకటేశం, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, వడ్డెరసంఘం ప్రతినిధి బోసు రవి, కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధి సుధాకర్‌గౌడ్, జిల్లా రజక సంఘం ప్రతినిధి అజయ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కేంద్ర బృందం

# మాల్‌లో కేంద్ర బృందం ప్రతినిధులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా..

యాచారం, ఏప్రిల్ 11 : మండల పరిధిలోని మాల్‌లో కేంద్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రతినిధుల బృందం పంకజ్, చంద్రానిషా ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. మాల్ పశువుల సంత స్థలాన్ని పరిశీలించారు. సంతకు సంబంధించిన పలు అంశాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులపై అధికారులను అడిగి ఆరా తీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వైకుంఠదామం, రైతు వేదిక, కంపోస్టుయార్డు, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. కేంద్రం ప్రభుత్వం అందజేయనున్న ఆత్మ నిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డు, నేషనల్ పంచాయతీ అవార్డుల కోసం గ్రామాలను పరిశీలిస్తున్నట్లు బృందం ప్రతినిధులు పంకజ్, చంద్రానిషా తెలిపారు. దేశంలోనే 9 అవార్డులను అందజేయగా తెలంగాణలో మాల్ పంచాయతీని సైతం గుర్తించినట్లు తెలిపారు. మాల్ గ్రామ పంచాయతీ అభివృద్ధిపై సేకరించిన రికార్డులను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఉన్నత స్థాయిలో పరిశీలించిన గ్రామాల్లో నుంచి ఉత్తమ గ్రామాలను ఎంపిక చేసి అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

# ముగిసిన అంతర్జాతీయ సాంకేతిక సదస్సు



సింబయాసిస్ సదస్సులో పాల్గొన్న వివిధ కళాశాలల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు

నందిగామ, ఏప్రిల్ 11 : మండల పరిధిలోని మొదళ్లగూడలో ఉన్న సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సింబయాసిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ రజనీకాంత్ ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగం, రానున్న రోజుల్లో చేయాల్సిన సాంకేతిక ఆభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఇలాంటి సదస్సులు పరిశోధకులకు ఎంతో మేలు చేకూరుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల డైరెక్టర్లు అలెక్స్ వైబెల్ (జర్మనీ), మార్సెలో క్యాంపోస్(బ్రెజిల్), అడోల్ఫో గార్సియా (యూఎస్ఏ), సామ్యుయేల్ పినిల్లా, యశ్వంత్‌గుప్తా(పుణే), సెలియా షానాజ(బంగ్లాదేశ్), అభిషేక్ మహేశ్‌అప్పాజీ (బెంగళూరు), స్థానిక ఆచార్యులు పాల్గొన్నారు.

# ప్రగతి సూచిలో దుద్యాల్‌కు అగ్రస్థానం




దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 11 : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల ప్రగతి సూచికలను ప్రకటించింది. అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం మూడు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండల పరిధిలోని దుద్యాల్ గ్రామం అగ్రస్థానంలో నిలిచింది. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, చిన్నారుల సౌకర్యాల కల్పన, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతులలో స్వావలంభన, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. వీటిలో దుద్యాల్ గ్రామానికి అగ్రస్థానం లభించింది. గతంలో పని చేసిన సర్పంచ్ ఖాజ, కార్యదర్శి రమేశ్ రాథోడ్ చేసిన కృషిని గ్రామస్తులు అభినందించారు.

## హక్కుల సాధనకు

# బీసీలు ఏకం కావాలి



జాతీయ బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణను సన్మానిస్తున్న బీసీ సేన నాయకులు

నందిగామ, ఏప్రిల్ 11 : వెనుకబడిన బీసీలంతా హక్కుల సాధన కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందని బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బీసీ సేన మండల అధ్యక్షుడు మారుతీయాదవ్ ఆధ్వర్యంలో నందిగామ మండల కేంద్రంలో బీసీ సేన కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బర్క కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అణగారిన బీసీల ఆత్మగౌరవం, హక్కుల కోసం జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే తమ జీవితాలను త్యాగం చేశారని, బీసీ అభివృద్ధి, రాజ్యాధికారం కోసం బీసీలంత కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేశమోని శ్రీనుయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, శివ, శేఖరప్ప, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్, జలజ, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# దంత వైద్యులేరి..?

జిల్లా మెడికల్ కళాశాలల్లో దంత వైద్యుల కొరత
ఖాళీల భర్తీపై కాంగ్రెస్ సర్కార్ కాలయాపన
సమస్యను పరిష్కరించాలని ఏఐడీఎస్ఎస్ఏ వినతి




సిటీబ్యూరో, ఏప్రిల్11, (నమస్తే తెలంగాణ): ఆరోగ్య తెలంగాణగా పదేళ్లు వర్ధిల్లిన రాష్ట్రం నేడు అనారోగ్యానికి గురవుతున్నది. వైద్యుల కొరత వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం సామాన్యులకు దూరమవుతున్నది. బీఆర్ఎస్ పాలనలో ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా జిల్లాకో వైద్య కళాశాల నిర్మిస్తే వాటిని ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు విస్మరించారు. రాజధాని నగరంలో మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో దంత వైద్యులు లేక మెడికల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు, మరోవైపు దంత సమస్యలతో బాధపడేవారంతా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో దంత వైద్యులు లేకపోవడంతో చేతినుంచి డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేట్ ఆసుపత్రుల మెట్లెక్కుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుండటం గమనార్హం. మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని ఆల్‌ఇండియా డెంటల్ స్టూడెంట్ అండ్ సర్జన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంఈ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

## ఎన్ఎంసీ నియమాలు గుర్తులేదా..?

గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని నూతన జిల్లాలన్నింటిలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే మారుమూల జిల్లాలకు సైతం మెడికల్ కళాశాల మంజూరు చేసి, నిర్మించింది. కార్పొరేట్ స్థాయిలో సర్కార్ వైద్యం అందించాలనే లక్ష్యాన్ని కేసీఆర్ సర్కార్ నిజం చేసింది. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ వైద్యరంగాన్ని పాతరేసింది. రాష్ట్రవ్యాప్తంగా 38 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ మెడికల్ కళాశాలల్లో మినహాయించి ఏ ఒక్క కళాశాలలో కూడా దంత వైద్యులు లేకపోవడం గమనార్హం. వాస్తవానికి ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం వందమంది విద్యార్థులు ఉన్న కళాశాలలో తప్పనిసరిగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రెసిడెంట్ ఒక్కొక్కరు చొప్పున డెంటల్ టెక్నీషియన్లు నలుగురు ఉండాలి. సీట్లు పెరుగుతున్న తరుణంలో సిబ్బంది కూడా పెరగాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200కు పైగా దంత విభాగంలో ఖాళీలు ఉన్నట్లు సమాచారం. వాటిని భర్తీ చేస్తేనే సర్కారు వైద్యం సామాన్యులకు అందించినవాళ్లమవుతాం. ఇప్పటికే దంత సమస్యల పరిష్కారానికి పలు ప్రైవేట్ ఆసుపత్రులు రూ.వేలల్లో వసూలు చేస్తూ, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

**ఖాళీలను భర్తీ చేయాలి**

> రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న దంత వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా ఆసుపత్రుల్లో దంత వైద్యుల కొరత వల్ల ప్రజలు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డీఎంఈ కార్యాలయంలో ఈ సమస్యపై వినతి పత్రం అందించాం. పరిష్కారం త్వరగా చూపాలని కోరాం.
>
> – డాక్టర్ ఎండీ మన్‌జూర్‌అహ్మద్, డెంటల్ స్టూడెంట్ అండ్ సర్జన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు

## అంతర్జాతీయ సమ్మేళనానికి కవులకు ఆహ్వానం



నరేందర్‌రావు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 11 : తెలుగు భా షా చైతన్య సమితి వార్షికోత్సవం సందర్భం గా హైదరాబాద్‌లో మే 8న త్యాగరాయ గానసభలో నిర్వహించే అంతర్జాతీయ కవి సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానం అందిందని షాద్‌నగర్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కవులు నరేందర్‌రావు, రవిప్రకాశ్ శుక్రవారం తెలిపారు. కవి సమ్మేళనంలో తమ కవితలను వినిపించాలని చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ ఆహ్వానం పంపించారన్నారు. ఈ ఆహ్వానం రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. అలాగే షాద్‌నగర్‌కు చెందిన కవులకు అంతర్జాతీయ కవి సమ్మేళన ఆహ్వానం రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పీజీ డిప్లొమా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్, పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, పీజీ డిప్లొమా ఇన్ మ్యాథమెటిక్స్ తదితర కోర్సుల పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను దూరవిద్య కేంద్రం నుంచి పోస్టులో పొందుతారని చెప్పారు. ఈ రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 300 అపరాధ రుసుముతో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

# మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలి

కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి



చిల్డ్రన్స్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 11 : పురపాలక సంఘం ఆదాయ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి సూచించారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. పట్టణ పరిధిలోని ఇంటి పన్నులు, దుకాణా సముదాయాల పన్నుల వసూళ్లకు సంబంధించి మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురపాలక సంఘం ఆదాయ వనరులను పెంచుకోవాలని, పన్ను వసూళ్లలో లక్ష్యం సాధించే దిశగా అధికారులు సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు.

అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి చెత్తతో తయారు చేస్తున్న ఎరువులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కును పరిశీలించి చేపట్టాల్సిన పనులను వివరించారు. ఆమె వెంట మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ ఫల్గున్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయినాథ్, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, మున్సిపల్ మేనేజర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.